సమస్యలుంటే సాక్షికి చెప్పండి
మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి
78932 44734
నంబర్‌ను సంప్రదించండి

## క్లుప్తంగా

### విశాఖ కుర్రోడి షార్ట్‌ఫిల్మ్‌కు అవార్డు



అవార్డు అందుకుంటున్న జితేంద్రకుమార్

కంచరపాలెం: విశాఖ కంచరపాలేనికి చెందిన పల్లా జితేంద్రకుమార్ యాదవ్ డైరెక్ట్ చేసిన 'డైరీ' షార్ట్‌ఫిల్మ్‌ను ప్రతిష్టాత్మక అవార్డు వరించింది. ఇండియన్ ఫిల్మ్ మేకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఇటీవల జరిగిన ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్ ఆఫ్ ఒడిశా కార్యక్రమంలో ఈ అవార్డును జితేంద్రకుమార్ అందుకున్నారు. మొత్తం 2 వేలకు పైగా నామినేటైన షార్ట్‌ఫిల్మ్‌ల్లో తాను తీసిన డైరీ ఎంపిక కావడం ఆనందంగా ఉందని జితేంద్రకుమార్ తెలిపారు. ఈ సందర్భంగా అతడిని పలువురు ప్రముఖులు అభినందించి, మరిన్ని అవార్డులు సాధించాలని ఆకాంక్షించారు.

### పౌష్టికాహారంపై అవగాహన



గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం ప్యాకెట్లు అందిస్తున్న కార్యకర్త

విశాఖ విద్య: అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న పౌష్టికాహారాన్ని గర్భిణులు, బాలింతలు సద్వినియోగం చేసుకోవాలని గౌరీనగర్ అంగన్‌వాడీ కార్యకర్త జె.మార్త, సచివాలయ ఆరోగ్య కార్యదర్శి శ్యామల సూచించారు. గౌరీనగర్ అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం టీహెచ్‌ఆర్ పంపిణీ చేశారు. కేంద్రం పరిధి లోని గర్భిణులు, బాలింతలకు ఆరోగ్యపరమైన అంశాలపై అవగాహన కల్పించారు. గర్భిణులకు వ్యాధి నిరోధక టీకాలు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆహార పద్ధతులు పాటించి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలన్నారు. ఆశ కార్యకర్త లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

### డ్రాయింగ్ పోటీల్లో గురుకుల విద్యార్థుల ప్రతిభ

విశాఖ విద్య: ఉమ్మడి విశాఖ జిల్లా స్థాయిలో నిర్వహించిన డ్రాయింగ్ పోటీల్లో శ్రీకృష్ణాపురం సాంఘిక సంక్షేమ గురుకుల విద్యార్థులు ప్రతిభ చూపారు. అనకాపల్లి జిల్లా కొక్కిరాపల్లిలో జరిగిన పోటీల్లో పాల్గొన్న గురుకుల విద్యార్థులు కె.బాలు(9వ తరగతి), ఎల్.కార్తీక్(ఇంటర్ ఫస్టియర్) డ్రాయింగ్ విభాగంలో ఉమ్మడిగా ప్రథమ బహుమతి సాధించారు. ఈ విద్యార్థులకు తర్ఫీదు ఇచ్చిన ఆర్ట్ టీచర్ పి.సుధాకర్‌ను, వారిని ప్రోత్సహిస్తున్న గురుకుల ప్రిన్సిపాల్ రత్నవల్లిని గురుకులాల ఉమ్మడి జిల్లా కన్వీనర్ రూపవతి అభినందించారు. విద్యార్థులకు అవార్డు అందజేసి, భవిష్యత్‌లో మరిన్ని బహుమతులు అందుకోవాలని ఆకాంక్షించారు.

### ములగాడలో స్పీడ్ బ్రేకర్ల ఏర్పాటు



స్పీడ్ బ్రేకర్లు వేస్తున్న సిబ్బంది

మల్కాపురం: ములగాడ విలేజ్ నుంచి శ్రావణి షిప్పింగ్‌కు వెళ్లే సేవా మార్గంలో పలు చోట్ల శనివారం స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేశారు. డాక్‌యార్డ్ వంతెన మార్గం మూసివేయడంతో నగరానికి వెళ్లే పారిశ్రామిక వాసులు ఇప్పుడు ములగాడ విలేజ్ నుంచి మారుతీ సర్కిల్ వద్ద తిరిగి నగరానికి చేరుకుంటున్నారు. దీంతో ఈ మార్గంలో వాహనాల రద్దీ బాగా పెరిగింది. మితిమీరిన వేగంతో వస్తున్న కొంత మంది యువత రోడ్డు దాటుతున్న చిన్నారులు, వృద్ధు లను ఢీ కొడుతున్నారు. ఈ నేపథ్యంలో వాహనాల వేగాన్ని నియంత్రించడానికి సేవా మార్గంలో పలు చోట్ల స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేశారు.

సాక్షి
మీరు సాక్షి చందాదారులుగా చేరదలుచుకున్నారా!
లేదా మీకు పేపరు అందటంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయా!
సంప్రదించవలసిన నెంబరు
వైజాగ్ వెస్ట్
8978872250
సాక్షి

# బడీ లేదు.. గుడీ లేదు..!

**ప్రజాభీష్టంతో పనిలేకుండానే ఎక్కడవడితే అక్కడ మద్యం దుకాణాలు తెరుస్తున్నారు. బడీ.. గుడీ అని చూడకుండా మద్యం ఏరులై పారించి, సొమ్ము చేసుకునేందుకు కూటమి నేతలు స్కెచ్ వేస్తున్నారు. జనం తాగుబోతుల్లా మారినా పర్వాలేదు.. ప్రభుత్వం నిర్దేశించిన ఆదాయాన్ని తెచ్చిపెడితే చాలనే రీతిలో ఎక్సైజ్ అధికారులు కూటమి నేతలకే వంతు పాడుతున్నారు. ఇటీవల నిర్వహించిన లాటరీల్లో లైసెన్స్‌లను దక్కించుకున్న వారు పశ్చిమ నియోజకవర్గంలోని ప్రధాన సెంటర్లను దుకాణాల ఏర్పాటుకు ఎంచుకుంటున్నారు. వ్యాపారమే లక్ష్యంగా షాపుల ఏర్పాటులో నిబంధనలు గాలికొదిలేస్తున్నారు.**



కొత్తపాలెంలో నూతనంగా ఏర్పాటు చేసిన వైన్ షాప్ పక్కనే ఉన్న గుడి

- వాడవాడలా వెలుస్తున్న బెల్ట్ షాపులు
- కూటమి నేతల కనుసన్నల్లో నిర్వహణ
- ఒక్కో దుకాణానికి రూ.1 లక్ష వసూలు
- చోద్యం చూస్తున్న ఎక్సైజ్ అధికారులు

విశాఖ విద్య: పశ్చిమ నియోజకవర్గంలో ప్రస్తుతం ఏర్పాటు చేసిన మద్యం దుకాణాలన్నీ కూటమి నేతల కనుసన్నల్లోనే సాగుతున్నాయి. బయట వ్యక్తుల వచ్చి వైన్ షాపు ఏర్పాటు చేసినా.. వాటిని తమకు అప్పగించి వెళ్లిపోవాలని కూటమి నేతలు హుకుం జారీ చేస్తున్నారు. మద్యం దుకాణాలకు అనుబంధంగా అప్పుడే బెల్ట్ షాపులు సైతం కాలనీల్లో వెలిశాయి. కొత్తపాలెం, యల్లపువాని పాలెంలో బెల్ట్ షాపులకు మంచి డిమాండ్ ఉంది. రోజువారీ కూలి పనులు చేసుకునే వారు ఇక్కడ ఎక్కువగా ఉండటంతో బెల్ట్ షాపులకే ఎక్కువగా గిరాకీ ఉంటుందనే ఉద్దేశంతో కొంతమంది వీటిని ఏర్పాటు చేస్తున్నారు. ఇళ్లల్లోనూ, చిన్న చిన్న పాన్ షాపుల్లో మద్యం విక్రయించుకునేందుకు రూ.1 లక్ష వరకు చెల్లించాలని కూటమి నేతలు డిమాండ్ చేస్తున్నట్లు పెద్ద ఎత్తున ప్రచారం సాగుతోంది.

**విచ్చలవిడిగా బెల్ట్ షాపులు**

యల్లపువానిపాలెంలో బెల్ట్‌షాపుల ఏర్పాటులో ప్రజల నుంచి వ్యతిరేకత వ్యక్తమవుతున్నా.. పోలీసులను అడ్డుపెట్టుకొని, అలాంటి వారిపై బెదిరింపులకు దిగుతున్నట్లు తెలుస్తోంది. ఇదే మాదిరి నియోజవర్గంలోని అన్ని చోట్లా మద్యం షాపులకు అనుబంధంగా బెల్ట్ షాపులు వెలుస్తున్నాయి. ఎన్‌ఏడీ ఫ్లై ఓవర్ చుట్టూ పాన్ షాపుల్లో దర్జాగా మద్యం విక్రయిస్తున్నారు. ఫ్లై ఓవర్‌ను ఆనుకొని ఉన్న విద్యా సంస్థలకు వెళ్లే దారిలో సైతం పాన్‌షాపుల్లో మద్యం విక్రయిస్తుండటంతో అటుగా వెళ్లే విద్యార్థులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. సంబంధిత శాఖల అధికారులు వీటివైపు కన్నెత్తి కూడా చూడటం లేదు.



కొత్త వైన్ షాప్



కొత్తపాలెంలో వైన్ షాప్ వద్ద ప్రధాన రహదారిపై వాహనాల పార్కింగ్

**ప్రజాభిప్రాయం పట్టదా..**

మద్యం దుకాణాలు ఏర్పాటు చేసేముందు ఆ ప్రాంతంలోని ప్రజల అభిప్రాయాలను పరిగణలోకి తీసుకోవాలి. బడి, గుడి వంటి వాటికి దూరంగా మద్యం దుకాణాలు ఏర్పాటు చేయాలి. నియోజకవర్గంలో వైన్ షాపుల ఏర్పాటు ఇందుకు వ్యతిరేకంగా సాగుతోందని పలువురు అంటున్నారు. 89వ వార్డు కొత్తపాలెంలోని ప్రధాన సెంటర్‌లో రెండు దుకాణాలు ఏర్పాటు చేయడం వల్ల ట్రాఫిక్ ఇబ్బందులు ఎదురవుతాయని స్థానికులు చెబుతున్నారు. ఇదే విషయాన్ని ఎక్సైజ్ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా.. పట్టించుకోవటం లేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో దుకాణం ఏర్పాటు చేసినప్పుడే తీవ్రంగా వ్యతిరేకించామని, మళ్లీ దానికి పక్కనే మరో వైన్ షాపు తెరిపించారని కూటమి నేతలపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

### కొత్తపాలెంలో గుడికి ఇరువైపులా వైన్ షాపులు

జీవీఎంసీ 89వ వార్డు కొత్తపాలెం సెంటర్‌లో రెండు వైన్‌షాపులు తెరిచారు. రైల్వే అండర్ పాత్‌వే దాటిన వెంటనే ఈ దుకాణాలు అందరికీ కనిపించేలా ఏర్పాటు చేశారు. ఈ రెండింటి మధ్యలో గణపతి, ఆంజనేయ స్వామి వారి ఆలయాలు ఉన్నాయి. నిత్యం ఇక్కడ ఆధ్యాత్మిక కార్యక్రమాలు సైతం జరుగుతాయి. ఇలాంటి చోట మద్యం దుకాణాలు ఏర్పాటు చేయడంపై స్థానిక ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. దుకాణంలో మద్యం కొనుగోలు చేసిన మందుబాబులు గుడి ముందే తాగి చిందులేసి రోజులు వచ్చాయని పలువురు స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



గుడికి ఎదురుగా ఉన్న మద్యం దుకాణం

### వార్డుల్లో జెడ్సీ పర్యటన



వార్డులో సమస్యలు తెలుసుకుంటున్న జోన్-5 కమిషనర్ రాము

మల్కాపురం: జీవీఎంసీ జోన్-5 కమిషనర్ రాము పలువురు అధికారులతో కలిసి శనివారం 60, 59, 61 వార్డుల్లో పర్యటించారు. ముందుగా 60వ వార్డు గుల్లలపాలెం వుడా కాలనీ, జవహర్‌నగర్, ఇందిరా కాలనీ, శ్రీహరిపురం తదితర ప్రాంతాల్లోని సర్వీస్ రోడ్లపై వ్యర్థాలను చూసి ఆయన ఆగ్రహించారు. వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ సతీష్‌ను పిలిచి సర్వీస్ రోడ్లు ఇలా ఉంటే.. శుభ్రం చేయకుండా ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. ఉన్న సిబ్బందిని వార్డులోని పలు ప్రాంతాల్లో సర్దామని, ఒక్కో ప్రాంతానికి సిబ్బంది వెళ్లి పూడికలు తొలగిస్తున్నారని జెడ్సీకి ఆయన వివరణ ఇచ్చారు. అనంతరం 59, 61 వార్డుల్లో జెడ్సీ ఆయా ప్రాంతాల్లోని సమస్యలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఆయా వార్డుల శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

### 'వాతావరణ మార్పులు, వ్యవసాయం'పై సదస్సు



మాట్లాడుతున్న ప్రొఫెసర్ నరసింహారావు

విశాఖ సిటీ: వ్యవసాయ ఆర్థిక పరిశోధన కేంద్రం(ఏఈఆర్‌సీ), భారత ప్రభుత్వ వ్యవసాయ, రైతు సంక్షేమ మంత్రిత్వ శాఖతో కలిసి 'వాతావరణ మార్పులు, భారతీయ వ్యవసాయం-సుస్థిర పద్ధతులు' అనే అంశంపై శనివారం ఏయూలో సదస్సు నిర్వహించింది. ఈ సందర్భంగా ముఖ్య అతిథి వాణిజ్య కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎ.నరసింహారావు మాట్లాడుతూ వాతావరణ మార్పుల కారణంగా సుస్థిర వ్యవసాయ పద్ధతుల అవసరాన్ని వివరించారు. ఏఈఆర్‌సీ మాజీ డైరెక్టర్ డాక్టర్ టి.వి.ఎస్.రావు మాట్లాడుతూ వ్యవసాయంలో వాతావరణ మార్పులతో కూడిన సవాళ్లు, అవకాశాలను విశదీకరించారు. ఏపీసీఎన్‌ఎఫ్ జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ జె.మోహనరావు మాట్లాడుతూ వాతావరణానికి అనుగుణమైన వ్యవసాయ విధానాల అన్వయంపై అనుభవాలను పంచుకున్నారు. సదస్సు లో ప్రొఫెసర్ సాంబమూర్తి, ఏఈఆర్‌సీ పరిశోధకులు డాక్టర్ కె.ఆదిశేషు, డాక్టర్ కె.వి.గిరిబాబు, ఏఈఆర్‌సీ ఆనరరీ డైరెక్టర్ ప్రొఫెసర్ బి.లిల్లీగ్రేస్ యూనిస్, అధిక సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

## పారిశ్రామిక ప్రాంతంలో విద్యుత్ వెలుగులు



నక్కవానిపాలెం - శ్రీహరిపురం రహదారిలో విద్యుత్ లైట్ల వెలుగులు



జింక్ నుంచి గాజువాక ఆర్టీసీ డిపో వరకు వచ్చే మార్గంలో వెలుగుతున్న లైట్లు

మల్కాపురం: పారిశ్రామిక ప్రాంతం అంధకారం సమస్య నుంచి విముక్తి పొందింది. ఇక్కడి ప్రధాన రహదారులు, పలు వార్డుల్లో వీధిలైట్లు వెలగని పరిస్థితి ఉండేది. రాత్రిళ్లు అంధకారం అలుముకుని స్థానిక ప్రజలు, వాహన చోదకులు నానా తంటాలు పడేవారు. ఇటీవల పారిశ్రామిక ప్రాంతంలోని 40, 58, 59, 60, 61, 62, 63 వార్డుల్లో సుమారు 200 విద్యుత్ లైట్లు కొత్తవి అమర్చారు. మల్కాపురం, శ్రీహరిపురం, కోరమాండల్, గాజువాక ఆర్టీసీ డిపో, జింక్ ప్రధాన రహదారుల్లో విద్యుత్ షో ల్యాంప్స్‌ను జీవీఎంసీ విద్యుత్ విభాగ సిబ్బంది ఏర్పాటు చేశారు. దీంతో ఆయా ప్రాంతాల్లో విద్యుద్దీప వెలుగులు విరజిమ్ముతున్నాయి. స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## సబ్సిడీ సరకులు సక్రమంగా అందించాలి



ఎంవీపీ రైతుబజార్‌లో వినియోగదారులతో మాట్లాడుతున్న జేడీ సుధాకర్

ఆరిలోవ: రైతుబజార్లలో సబ్సిడీపై ఇస్తున్న టమోటా, ఉల్లిపాయలను వినియోగదారులకు సక్రమంగా అందించాలని అధికారులకు మార్కెటింగ్ శాఖ విశాఖ ప్రాంతీయ సంయుక్త సంచాలకుడు(జేడీ) సుధాకర్ సూచించారు. ఎంవీపీ రైతుబజార్‌ను శనివారం ఆయన సందర్శించారు. సబ్సిడీపై అందిస్తున్న టమోటా, ఉల్లిపాయల కౌంటర్లను సందర్శించి వాటి నాణ్యతను పరిశీలించారు. రోజుకు ఎన్ని టన్నులు విక్రయం జరుగుతున్నాయో రైతుబజార్ ఈవో జి.ప్రసాద్‌ను అడిగి తెలుసుకున్నారు. కూరగాయల స్టాళ్ల వద్ద వినియోగదారుతో జేడీ మాట్లాడారు. బోర్డులపై ప్రకటించిన ధరలకు రైతులు, వ్యాపారులు సరకులు విక్రయిస్తున్నారా, ధరల్లో తేడాలు చెబుతున్నారా అంటూ ఆరా తీశారు. టమోటా, ఉల్లిపై ఇస్తున్న సబ్సిడీని వినియోగదారుల సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. నాణ్యమైన సరకులు అందుబాటులో లేకపోతే ఈవో కార్యాలయంలో ఫిర్యాదు చేయాలన్నారు. కర్నూలు ఉల్లి రూ.37కి సబ్సిడీపై అందిస్తున్నట్లు తెలిపారు. జిల్లా వ్యవసాయ, వాణిజ్య, మార్కెటింగ్ శాఖాధికారి ఎస్.కె.యాసిన్, ఇంజినీర్ కెనడీ పాల్గొన్నారు.

## విద్యా రంగ పరిరక్షణకు పోరాటమే శరణ్యం

**యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి అంబేడ్కర్**



నూతన కమిటీతో ప్రమాణం చేయిస్తున్న అంబేడ్కర్

విశాఖ విద్య: ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణకు పోరాటాలే శరణ్యమని యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి టి.ఆర్.అంబేడ్కర్ అన్నారు. తోటగరువు ఉన్నత పాఠశాలలో చినగదిలి యూటీఎఫ్ మండల శాఖ 50వ స్వర్ణోత్సవ మహా సభ జిల్లా అధ్యక్షుడు నేతల ప్రభాకర్ అధ్యక్షతన శనివారం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా ప్రధాన కార్యదర్శి అంబేడ్కర్ మాట్లాడుతూ విద్యారంగాన్ని కాపాడుకోవడానికి రాజీలేని పోరాటానికి సన్నద్ధులు కావాలన్నారు. ఈ సందర్భంగా చినగదిలి మండల కార్యవర్గాన్ని ఎంపిక చేశారు. గౌరవ అధ్యక్షుడిగా ఎన్.ప్రసాద్, అధ్యక్షుడిగా మురళీ, ప్రధాన కార్యదర్శిగా పద్మావతి, కోశాధికారిగా కుమారి లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో పి.సురేష్, జి.ఉషారాణి, రాజేశ్వరి, జగన్, నీలాద్రి పాల్గొన్నారు.

## దళిత, బహుజనులకు సమాన అవకాశాలివ్వండి

సీతంపేట: భారత రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని రాజ్యసభ సభ్యుడు గొల్ల బాబూరావు అన్నారు. రామాటాకీస్ దరి అంబేడ్కర్ భవన్‌లో 'భారత రాజ్యాంగం, ప్రభుత్వ రంగ పరిశ్రమలు, రిజర్వేషన్లు'అనే అంశంపై అంబేడ్కర్ మెమోరియల్ సొసైటీ నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. రాజ్యాంగంలోని ప్రవేశికలో అన్ని రంగాల్లో సమాన అవకాశాలు కల్పించాలని ఉందన్నారు. దీని ప్రకారం ప్రభుత్వ రంగంతో పాటు ప్రైవేటు రంగంలోనూ దళిత, బహుజనులకు సమాన అవకాశాలు కల్పించాలని సూచించారు. సమాన అవకాశాలు అందరికీ లభించేలా తనతో కలిసొచ్చే ఎంపీలతో కలిసి పార్లమెంట్‌లో కృషి చేస్తానన్నారు. అంబేడ్కర్ భవన్ ప్రాంగణంలో నిర్మాణంలో ఉన్న అంబేడ్కర్ స్టడీ సర్కిల్‌కు ఎంపీ ల్యాండ్స్ నుంచి రూ.50లక్షలు కేటాయిస్తానని హామీ ఇచ్చారు. సొసైటీ అధ్యక్షుడు బొడ్డు కల్యాణరావు మాట్లాడుతూ రిజర్వేషన్లు నీరుగార్చడానికి అనేక ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. ప్రధాన కార్యదర్శి జె.వి.ప్రభాకర్ మాట్లాడుతూ రాజ్యాంగంలోని ఆర్టికల్ 16(4) ప్రకారం రిజర్వేషన్లు అమలవుతున్నాయని, కానీ ప్రభుత్వ రంగ పరిశ్రమలను ప్రైవేటీకరించడం రాజ్యాంగ వ్యతిరేకమన్నారు.

## 'కందుకూరి వీరేశలింగం'పై వక్తృత్వ పోటీలు

మద్దిలపాలెం: సంఘ సంస్కర్త కందుకూరి వీరేశలింగం పంతులు అనే అంశంపై మద్దిలపాలెం కళాభారతి ఆడిటోరియంలో శనివారం వక్తృత్వ పోటీలు నిర్వహించామని కళాభారతి కార్యదర్శి డాక్టర్ గుమ్ములూరి రాంబాబు తెలిపారు. నగరంలోని వివిధ పాఠశాలల నుంచి 22 మంది విద్యార్థులు పాల్గొన్నారన్నారు. విజేతలకు ఈ నెల 24న బహుమతులు అందిస్తామని చెప్పారు. కార్యక్రమానికి న్యాయ నిర్ణేతలుగా సూర్యారావు, వేణు, రమణమూర్తి వ్యవహరించారని పేర్కొన్నారు. వివిధ పాఠశాలలు, కళాశాల స్థాయిలో వ్యాస రచన పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. వ్యాసరచన ప్రతులను తమకు చేరగానే నిష్ణాతులచే విజేతలను ఎంపిక చేయనున్నామని తెలిపారు. కళాశాల స్థాయిలో వ్యాసరచన పోటీల్లో విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ నగదు బహుమతులు అందజేస్తామన్నారు. మొదటి విజేతకు రూ.3 వేలు, ద్వితీయ రూ.2 వేలు, తృతీయ రూ.1,000, ప్రోత్సాహక బహుమతులు ఇస్తామని రాంబాబు పేర్కొన్నారు. ఈ నెల 24న జరిగే బహుమతుల ప్రదానోత్సవానికి ముఖ్య అతిథిగా విశాఖ ఎంపీ శ్రీభరత్ హాజరుకానున్నారన్నారు.



పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు


## సాయి మందిరం అభివృద్ధికి సహకరించండి



కార్పొరేటర్ రమణను సత్కరిస్తున్న ధ్యాన మందిర కమిటీ పెద్దలు

విశాఖ విద్య: జీవీఎంసీ 90వ వార్డు ఏపీఎస్ఈబీ కాలనీలోని శ్రీ షిర్డీసాయి ధ్యాన మందిరం అభివృద్ధికి సహకరించాలని ఆలయ కమిటీ అధ్యక్షుడు విల్లా సత్యనారాయణరావు కోరారు. ఈ మేరకు శనివారం నూతన కమిటీ సభ్యులంతా కార్పొరేటర్ బొమ్మిడి రమణను మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనను సత్కరించి, బాబా ప్రసాదం అందజేశారు. జీవీఎంసీ ద్వారా మందిరాన్ని అభివృద్ధి చేసేలా చూడాలని కార్పొరేటర్‌ను వారు కోరారు. తన వంతు సహకారం అందిస్తానని రమణ తెలిపారు.

## పోలీస్ మెన్ వెయిటింగ్ హాల్ ప్రారంభం



వెయిటింగ్ హాల్‌ను ప్రారంభిస్తున్న సీపీ శంఖబ్రత బాగ్చీ

విశాఖ సిటీ: నగర ఆర్మ్‌డ్ రిజర్వ్ ఆవరణలో నూతనంగా నిర్మించిన పోలీస్ మెన్ వెయిటింగ్ హాల్‌ను నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి శనివారం ప్రారంభించారు. హాల్ పరిసర ప్రాంతాలు పరిశుభ్రంగా ఉంచాలని, సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, లైటింగ్ పెంచాలని అధికారులను ఆదేశించారు. అనంతరం పోలీసు ఉన్నతాధికారులతో కలిసి ఆ హాల్‌లో సిబ్బందితో సమావేశమయ్యారు. సిబ్బంది నుంచి వచ్చిన అభ్యర్థన మేరకు ఈ హాల్‌ను సిద్ధం చేయాలనే ఆలోచన వచ్చిందని తెలిపారు. సిబ్బందికి ఏమైనా అవసరాలు ఉంటే 7995095799 నెంబర్ ద్వారా తెలియజేయాలని సూచించారు. సిబ్బందికి అవసరమైనప్పుడు సెలవులు ఇవ్వాలని అధికారులకు చెప్పారు. అలా ఇవ్వకుంటే సిబ్బంది నేరుగా తనకు తెలియజేయవచ్చన్నారు. అలాగే ఎక్కువ వయస్సు ఉన్న వారికి హెడ్‌క్వార్టర్స్‌కు సమీపంలో విధులు వేయాలని, తక్కువ వయస్సు ఉన్న వారికి బందోబస్తు విధులు వేయాలన్నారు. హోంగార్డులకు ట్రావెలింగ్ అలవెన్సులు లేనందున వీలైనంత వరకు వారి ఇళ్లకు దగ్గరలోనే డ్యూటీలు వేయాలని చెప్పారు. అనంతరం హాల్ నిర్మాణంలో భాగమైన సిబ్బందిని సత్కరించి అభినందించారు.

## రైతుబజార్‌లో తనిఖీలు

**కూరగాయలు, వస్తువుల విక్రయాలపై ఆరా**



స్టాల్‌ను పరిశీలిస్తున్న మార్కెటింగ్ అధికారి యాసిన్

విశాఖ విద్య: జీవీఎంసీ 52వ వార్డులోని మర్రిపాలెం రైతు బజార్‌ను శనివారం జిల్లా వ్యవసాయ, వాణిజ్య, మార్కెటింగ్ అధికారి యాసిన్ తనిఖీ చేశారు. రైతుబజార్ లో ఉన్న టమాటా, ఉల్లిపాయలతో పాటు ప్రభుత్వ సరఫరా చేస్తున్న కర్నూలు ఉల్లిపాయల స్టాల్స్‌ను పరిశీలించారు. సబ్సిడీ పై క్యూ ఆర్ కోడ్‌ను ఉపయోగించి అమ్ముతున్న ఆయిల్ కౌంటర్‌ను సందర్శించి కొనుగోలు చేయడానికి వచ్చిన వినియోగదారులు వివరాలు పరిశీలించారు. రైస్ కార్డు తీసుకొచ్చిన వారి వివరాలు, కార్డు నంబర్ నమోదు చేసి మాత్రమే నూనె ఇవ్వాలని సూచించారు. టమాటా, ఉల్లిపాయలు నాణ్యంగా ఉన్నవి మాత్రమే వినియోగదారులకు అందించాలన్నారు. ఈ సందర్భంగా రైతు బజార్‌లో దుకాణాలు నిర్వహిస్తున్న రైతుల గుర్తింపు కార్డులను పరిశీలించారు. వారికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో రైతు బజార్ ఈవో కొమ్మనాపల్లి వరహాలు, సహాయకుడు ప్రతాప్ పాల్గొన్నారు.

## నేడు యాదవ సంఘం సమావేశం

మల్కాపురం: జిల్లా యాదవ సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 20న శివాజీపాలెం సవేరా ఫంక్షన్ హాల్‌లో జరగనున్న సమావేశానికి పారిశ్రామిక ప్రాంత యాదవ సంఘాల ప్రతినిధులు, సభ్యులు హాజరు కావా లని సంఘ ప్రతినిధి పుర్రె సురేష్‌యాదవ్ పిలుపునిచ్చారు. 59వ వార్డు శాంతిగిరి కాలనీలోని తన కార్యాలయంలో శనివారం ఆయన మాట్లాడారు. వచ్చే నెల 15న రాధాకృష్ణ మహోత్సవాలు జరగనున్నాయని, వీటి నిర్వహణ తదితర అంశాలపై ఆదివారం జరిగే సమావేశంలో చర్చిస్తారన్నారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంట ల వరకు సమావేశం జరుగుతుందని, యాదవులంతా తరలిరావాలని కోరారు.

## ప్రేమ విఫలమై యువకుడి ఆత్మహత్య?

మర్రిపాలెం: కంచరపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ యువకుడు మనస్తాపంతో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాలిలా.. తుమ్మడిపాలెంలో చరణ్ రూప్ తేజ తల్లిదండ్రులు, సోదరుడితో కలిసి నివాసం ఉంటున్నాడు. శుక్రవారం రాత్రి యువకుడి తల్లి, సోదరుడు వారి బంధువుల ఇంటికి వెళ్లారు. తిరిగి రాత్రి 10.30 గంటల ప్రాంతంలో ఇంటికి తిరిగి వచ్చి చూడగా తలుపులు మూసివేసి ఉన్నాయి. ఎంతసేపటికీ తలుపులు తెరవకపోవడంతో అతడి సోదరుడు వాటిని బద్దలుకొట్టి చూడగా.. చరణ్ చీరతో ఫ్యాన్‌కు ఉరివేసుకుని వేలాడుతున్నాడు. వెంటనే పోలీసులకు ఈ విషయం తెలియజేశారు. వారు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతదేహాన్ని కేజీహెచ్‌కు తరలించి, శనివారం పోస్ట్‌మార్టం నిర్వహించారు. ఆ యువకుడు వన్‌టౌన్ ప్రాంతంలో ఓ యువతిని ప్రేమించాడని, ప్రేమ విఫలం కావడంతో మనస్తాపం చెంది ఆత్మహత్యకు పాల్పడి ఉంటాడని కుటుంబ సభ్యులు తెలిపినట్లు పోలీసులు చెప్పారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

IN THE HONOURABLE COURT OF THE II ADDITIONAL (SENIOR DIVISION) JUDGE AT VISAKHAPATNAM
I.P. 51/2024
Between:
Sravanam Meenakshi ... Petitioner
AND
G.S.N.Naidu and 27 others ... Respondents
PUBLIC NOTICE
Whereas, the petitioner herein filed the above Insolvency Petition against the Respondents for seeking to adjudicate the petitioner as Insolvent U/s4 and 5 of Provincial Insolvency Act and Protection against the arrest of the petitioner in Execution Proceedings against the petitioner and his family members. All are Respondents No. 1 to 28 are hereby called upon to appear before the Hounrable court on 07-11-2024 at 10.30 A.M., either in person or through an Advocate failing which the matter will be determined in your absence.
By the Order of the Hounrable Court.
Visakhapatnam 20-10-2024
S.Pradeep Kumar
H.Ravi Kumar, Advocates, Visakhapatnam. Cell: 98439 08969

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
వైజాగ్ వెస్ట్
9912222753, 9705933394
Office mail : sakshiadvtvsp@gmail.com